దళిత్‌ క్రిస్టియన్ల రిజర్వేషన్లను కొనసాగించాలి



కమిషన్‌ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం ఇస్తున్న క్రిస్టియన్‌ మైనార్టీ ప్రతినిధులు

అమీర్‌పేట: రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగించాలని ఏఐయూసీఎంఈఆర్‌ అధ్యక్షులు జోస్‌ డానియేల్‌, హైకోర్టు సీనియర్‌ న్యాయవాది సుధీర్‌ కుమార్‌ కోరారు. దళిత్‌ క్రిస్టియన్‌, దళిత్‌ ముస్లిం రిజర్వేషన్లపై అధ్యయనం చేపట్టిన మాజీ సీజేఐ, షెడ్యూల్‌ కులాల కమిషన్‌ చైర్‌పర్సన్‌ జస్టిస్‌ కె.జీ.బాలకృష్ణన్‌ను ప్రతినిధుల బృందం సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. మతం మారినా కులం ఎన్నటికీ మారదని, మతం పేరుతో దళిత్‌ క్రిస్టియన్‌ మైనార్టీల రిజర్వేషన్లు తొలగించకూడదని అన్నారు. మాజీ అడిషనల్‌ డీజీపీ కె.బాబురావు, బిషప్‌ వీరాజీ, జి.సాల్మన్‌, ప్రభాకర్‌, మధు తదితరులు ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

రాంగోపాల్‌పేట్‌: మోండా కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కూడా ఉన్నారని స్థానికులు అంటున్నారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి విగ్రహాల ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మరో మారు ఇలాంటి ఘటనలు జరుగకుండా ప్రభుత్వ యంత్రాంగం మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

గుండెపోటుతో బీజేపీ నేత కుమారుడు మృతి



డెనిసన్‌ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మర్రి పురురవరెడ్డి

పద్మారావునగర్‌: బీజేపీ నాయకులు విజయ్‌కుమార్‌ కుమారుడు డెనిసన్‌(25) సోమవారం మరణించారు. తెల్లవారు జామున గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే డెనిసన్‌ మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. డెనిసన్‌ మరణవార్త తెలియడంతో అనేక మంది విజయ్‌కుమార్‌ నివాసాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి పద్మారావునగర్‌లోని విజయ్‌కుమార్‌ నివాసానికి వచ్చి డెనిసన్‌ మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో.. రూ.టమాటా.55, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్‌ 70, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 23, క్యారెట్‌ 40, దొండ 35, గుండుబీన్స్‌ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్‌ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 60, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా టెంట్ల ఏర్పాటు..!

ఇది వరకు తొలగించినా.. మళ్లీ టెంట్లు వేసిన అక్రమదారులు



బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో టెంట్లు వేసిన దృశ్యం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్లతో పాటు టెంట్లు వేశారని ఇటీవల కొంతమంది హైదరాబాద్‌ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్‌ ఆదేశాల మేరకు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు మూడు వారాల క్రితం ఇక్కడ ప్రభుత్వ స్థలంలో షెడ్లను తొలగించారు. ఈ స్థలం ప్రస్తుతం రెవెన్యూ కస్టడీలో ఉందని అధికారులు ప్రకటించారు. అయితే వీటిని తొలగించి రెండు రోజులు గడవక ముందే ఆక్రమణదారులు మళ్లీ యథా ప్రకారం అదే స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి రెవెన్యూ అధికారులకు సవాల్‌ విసిరారు. సుమారుగా రూ.500 కోట్ల విలువైన ఈ స్థలంలో కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రాగా స్పందించిన అధికారులు ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ టెంట్లు వేసుకోవడం చర్చనీయాంశమైంది. అధికారులు స్పందించి వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మందుబాబుల వీరంగం



దెబ్బతిన్న కారు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌రోడ్‌ నెం. 2లోని ఇందిరానగర్‌ బస్తీలో తాగుబోతులు, ఆవారా యువకుల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కొంత మంది తాగుబోతులు బస్తీలో మద్యం సేవించి ఒకరిని ఒకరు కొట్టుకుంటూ రామారావు ఆస్పత్రి వద్ద పార్కింగ్‌ చేసిన ఓ కారుతో పాటు మినీ డీసీఎం వ్యాన్‌ అద్దాలను పగలగొట్టారు. గతంలో కూడా ఇక్కడ పలుమార్లు ఆవారా యువకులు గంజాయి సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆవారా యువకులపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మధ్యలోనే ఆగిపోయిన అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం



పునాది నిర్మాణానికే పరిమితమైన సీతాఫల్‌మండి విద్యా సంస్థల భవనం

‘అభివృద్ధి’పై నీలినీడలు

- విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు
- మూలనపడ్డ వంతెనల నిర్మాణం
- లష్కర్‌ ప్రజల్లో నిరాశ నిస్పృహలు

సికింద్రాబాద్‌: పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ఉరుకులు పరుగుల దిశగా ప్రారంభమైన భారీ అభివృద్ధి పనులు శాసనసభ ఎన్నికల అనంతరం ఒక్కసారిగా ఆగిపోయాయి. బీఆర్‌ఎస్‌ అధికారం కోల్పోయి కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సికింద్రాబాద్‌ నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులపై నీలినీడలు అలముకున్నాయి. ప్రారంభమైన భారీ అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోగా, నిధులు మంజూరై ఉన్న పనుల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

⇨ సికింద్రాబాద్‌ నుంచి వరుసగా మూడు మార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్‌ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఒకమారు రాష్ట్ర కేబినెట్‌ మంత్రిగా, మరో మారు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో రూ.100 కోట్లమేర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. ఇందులో కొన్ని అర్థాంతరంగా ఆగిపోయి, మరికొన్ని ప్రారంభించక ప్రశ్నార్థకంగా మారిపోయాయి.

సన్నగిల్లుతున్న ఆశలు...

ఇటీవలి శాసనసభ ఎన్నికలకు ముందు ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఏడాదికి దగ్గర కాలం గడిచిపోయినా ఆగిన అభివృద్ధి పనులు నేటికీ పునఃప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో సదరు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



లాలాపేటలో అర్ధతరంగా నిలిచిపోయిన స్విమ్మింగ్‌పూల్‌ నిర్మాణం

హైస్కూలు, జూనియర్‌, డిగ్రీ కళాశాల, ఆసుపత్రులు, మల్టీపర్పస్‌ ఫంక్షన్‌హాళ్లకు అధునాతన భవనాలు వస్తాయని, స్విమ్మింగ్‌పూల్‌ అందుబాటులోకి వస్తుందని, వంతెనల నిర్మాణంతో ప్రయాణ సమస్యలకు తెరపడుతుందని హర్షించిన లష్కర్‌ ప్రజల్లో క్రమేణా నిరాశ, నిస్పృహలు అలముకుంటున్నాయి.

జాప్యంతో ఇబ్బందులు..

ఎంతోమంది పేదలకు పెద్దిక్కుగా ఉన్న సీతాఫల్‌మండి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోవడంతో రోగులు అవస్థలపాలవుతున్నారు. ఇక్కడి పురాతన భవనం కూల్చివేయడంతో వైద్యసేవలు చెల్లాచెదురయ్యాయి. వివిధ ప్రాంతాలకు తరలించిన వైద్య సేవలు పొందడం కోసం రోగులు వ్యప్రయాసలు భరించాల్సి వస్తుంది.

⇨ విద్యా సంస్థల భవనాలదీ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి పాత భవనాలు నేల మట్టం చేయడంతో పాఠశాలల విద్యార్థులు, జూనియర్‌, డిగ్రీ కళాశాలల విద్యార్థులు మూడు ప్రాంతాలకు వెళ్లాల్సి వసతుంది. అక్కడి ఇరుకు గదుల్లో ఇబ్బందుల మధ్యే బోధనలు సాగుతున్నాయి.

⇨ వంతెనల నిర్మాణం కోసం నిధుల మంజూరు నియోజకవర్గ ప్రజల్లో కొత్త ఆశలు నింపింది. మెట్టుగూడ–చిలకలగూడ, సీతాఫల్‌మండి–మాణికేశ్వరీనగర్‌ రైల్వే వంతెనల పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపించడం లేదు.

⇨ అర్థాతరంగా నిలిచిపోయిన అడ్డగుట్ట, లాలాపేటలోని మల్టీపర్పస్‌ ఫంక్షన్‌హాళ్లు, లాలాపేట స్విమ్మింగ్‌పూల్‌ నిర్మాణం పనులు ప్రశ్నార్థకంగా మారాయి. పేద ప్రజల వివాహాది శుభ కార్యాలకు అందుబాటులో ఉండే ఫంక్షన్‌హాళ్లిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ముందుకు సాగని రూ.100కోట్ల పనులు

అర్ధంతరంగా నిలిచినవి

⇨ రూ.12 కోట్ల వ్యయంతో సీతాఫల్‌మండి కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం.

⇨ రూ.29.75 కోట్ల వ్యయంతో సీతాఫల్‌మండి హైస్కూల్‌, కళాశాలల భవన సముదాయం.

⇨ రూ.6కోట్లతో లాలాపేట స్విమ్మింగ్‌పూల్‌.

⇨ రూ.3 కోట్లతో అడ్డగుట్ట, లాలాపేట మల్టీపర్పస్‌ కమ్యూనిటీహాళ్లు.

ప్రతిపాదించినవి

⇨ రూ.30 కోట్లతో మెట్టుగూడ–చిలకలగూడ రైల్వే వంతెన

⇨ రూ.20 కోట్లతో సీతాఫల్‌మండి–మాణికేశ్వర్‌నగర్‌

అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తాం. ప్రభుత్వ మారినంత మాత్రాన అభివృద్ధి పనులను వదిలేది లేదు. ఇక్కడి ప్రజల అవసరాలను, గత ప్రభుత్వంలో చేపట్టిన, ప్రతిపాదించిన అభివృద్ధి పనులను ప్రభుత్వం దష్టికి తీసుకెళుతాం. కొంతమేర జాప్యం జరిగినప్పటికీ నిర్మాణం పనులు ప్రారంభమైన, ప్రతిపాదించిన పనులను పూర్తిచేయిస్తాం.



టి. పద్మారావుగౌడ్‌, ఎమ్మెల్యే సికింద్రాబాద్‌

కార్మికుల కుటుంబాలను ఆదుకోండి

- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన ఎంపీ ఈటల

రసూల్‌పురా : కరోనా సమయంలో కంటోన్మెంట్‌ బోర్డు కార్యాలయంలోని శానిటేషన్‌ విభాగంలో పనిచేస్తున్న కొందరు కార్మికులు మరణించారని వారి కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాల కోసం ఖాళీల 5 శాతం సీలింగ్‌ను మినహాయించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని సోమవారం ఈటల కోరారు. రక్షణ మంత్రిత్వ శాఖ కింద కంటోన్మెంట్‌ బోర్డులు డీమ్డ్‌ మున్సిపల్‌ సేవలను అందించే ఏకైక సంస్థలను పొరుగున్న ఉన్న మున్సిపాలిటీల్లో ఉద్యోగి మరణించిన రెండు మూడు నెలల్లోనే కారుణ్య ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయని ఈటల తెలిపారు. ఎంప్లాయిస్‌ యూనియన్‌ విజ్ఞప్తితో పాటు సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ బోర్డు కార్యాలయంలోని శానిటేషన్‌ విభాగంలో సిబ్బంది కొరత ఉందని నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని ఈటల కేంద్రమంత్రిని కోరారు.

సీఎంను కలిసిన నవీన్‌యాదవ్‌



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న నవీన్‌

వెంగళరావునగర్‌: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ నాయకులు వి.నవీన్‌ యాదవ్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఆయనకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఎంకు పూలమొక్కను అందజేశారు.

సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ

కాచిగూడ: అవంతినగర్‌ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం హిమాయత్‌నగర్‌ కార్పొరేటర్‌ జి.మహాలక్ష్మీ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు వాటర్‌ క్యూరింగ్‌ చేపట్టాలని, మ్యాన్‌హోల్స్‌ లెవెల్‌ చూసుకో వాలని అన్నారు. వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాము, కాలనీ ప్రతినిధులు జేపీ, రెడ్డి, శ్రీనాథ్‌, కాంగ్రెస్‌ నేతలు మహేష్‌ కుమార్‌, జగదీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం



మహాత్మనగర్‌లో స్థానిక మహిళలతో మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్‌ ప్రాంతానికి సరిపడా తాగునీరు అందించడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తాగునీటి కోసం ప్రభుత్వంతో సమరం తప్పదని కంటోన్మెంట్‌ బోర్డు నామినేటెడ్‌ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. సోమవారం బోర్డు ఆరవ వార్డు మహాత్మనగర్‌లో బస్తీబాట కార్యక్రమంలో భాగంగా స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని వారం రోజులకు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం కంటోన్మెంట్‌కు సరిపడ తాగునీరు విడుదల చేయకపోవడం కారణంగా ప్రజలకు తాగునీరు అందించలేకపోతున్నామని చెప్పారు. ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా దున్నపోతు మీద వాన కురిసిన చందాన వ్యవహరిస్తోందని కంటోన్మెంట్‌ ప్రజలు ప్రభుత్వం పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కపిల బరాబరి, స్థానిక బీజేపీ నేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

వ్యర్థాల తరలింపుపై స్పెషల్‌డ్రైవ్‌

- సికింద్రాబాద్‌ జెడ్‌సీ రవికిరణ్‌



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జెడ్‌సీ రవికిరణ్‌, డీసీపీ రాహుల్‌ హెగ్డే

సికింద్రాబాద్‌ : జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ జోనల్‌ పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, ఎప్పటి నుంచో పోగుబడ్డ వ్యర్థాలను గుర్తించి అక్కడి నుంచి తరలింపునకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నామని జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆదేశాల మేరకు జోనల్‌ కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బందితో సోమవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో గత కొంతకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలతోపాటు చెత్త చెదారాలను తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య విభాగ అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్‌ నియంత్రణ, జీబ్రా క్రాస్సింగ్‌, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించారు. విద్యుత్‌ స్తంభాల తరలింపు, అంతర్గత రహదారుల అభివృద్ధి, గుంతలను పూడ్చడం, మురుగు, మంచినీటి లో ప్రెషర్‌ సమస్యల పరిష్కారం, ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగించి, రెడ్‌ పెయింట్‌ వేయించాలని తీర్మానించారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్‌, జలమండలి, పారిశుద్ధ్యం, పోలీస్‌, విద్యుత్‌, ప్రాజెక్ట్స్‌, ఎస్‌ఎన్‌డీపీ తదితర విభాగాల సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించాలని, ప్రజలంతా ఆయా విభాగాల అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌హెగ్డే, సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ అనిల్‌రాజ్‌, సిటీప్లానర్‌ రఘునందన్‌, ప్రాజెక్ట్స్‌ ఈఈ రోహిణి, డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లు, ఆయా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌..

రైలులోంచి జారిపడి వ్యక్తి మృతి

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలులోంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్‌ – లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలో రైలులో నుంచి సుమారు 25–30 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పడిపోయాడు. ఈ క్రమంలో అతని పై నుంచి రైలు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు, నలుపు, ఆకుపచ్చ కలర్స్‌తో ఉన్న టీషర్ట్‌ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన తుకారాం గేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ తెలిపిన మేరకు.. అడ్డగుట్ట డీ సెక్షన్‌లో నివాసముంటున్న ప్రసాద్‌ పాల్‌(40) సెంట్రింగ్‌ పని చేసుకుంటూ ఇంట్లో ఒక్కడే ఉంటాడు. మద్యానికి బానిసైన ఇతను నిత్యం మద్యం సేవిస్తూ ఇంటికొచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లోకి వెళ్లిన ప్రసాద్‌ ఆదివారం మధ్యాహ్నం వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీలో నుంచి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఎంత పిలిచినా అతను చలనం లేకుండా పడుకొని ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లి చూడగా అతను మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

సనత్‌నగర్‌: జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా బేగంపేట ఎన్‌బీటీనగర్‌ కమ్యూనిటీ హాల్‌ ప్రహరీని కూల్చడంపై స్థానిక బస్తీవాసి చిరంజీవి బేగంపేట సర్కిల్‌ డీఎంసీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని సోమవారం డీఎంసీకి అందజేశారు. బేగంపేట పాటిగడ్డ ఎన్‌బీటీనగర్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం గతంలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారని, ఆ సమయంలో ప్రహరీ కూడా నిర్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించిన ప్రహరీగోడను ఎలాంటి అనుమతి లేకుండా కూల్చివేసి సొంతంగా గేటు నిర్మాణం జరపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు.

వ్యభిచార గృహంపై దాడి

వెంగళరావునగర్‌: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లోని ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లుగా మధురానగర్‌ పీఎస్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ అవినాష్‌ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ నిర్వాహకులు వంశీ, అతని భార్య ఉన్నారు. వారితో పాటుగా వైజాగ్‌కు చెందిన మహిళ కూడా ఉంది. నిర్వాహకులను పోలీసులు ప్రశ్నించగా వైజాగ్‌కు చెందిన మహిళతో వ్యభిచారం చేయిస్తున్నట్లుగా అంగీకరించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కండోమ్స్‌, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్‌ లాక్కొని పరార్‌

వెంగళరావునగర్‌: రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్న యువకుడి ఫోన్‌ లాక్కుని వెళ్లిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన సాయి కృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన కారును మైత్రీవనం సమీపంలో ఆపి కూకట్‌పల్లి వెళ్ళడానికి బస్సు కోసం రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చి సాయికృష్ణ చేతిలోని ఫోన్‌ లాక్కుని పారిపోయాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా దసరా ముగింపు వేడుకలు



దసరా వేడుకల్లో విజయారెడ్డి

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఇందిరానగర్‌ కట్టమైసమ్మ దేవాలయ ఆవరణలో దసరా పర్వదిన ముగింపు వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఖైరతాబాద్‌ కాంగ్రెస్‌ నాయకురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ఈ వేడుకలకు విచ్చేసి స్థానికులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన రావణ దహన వేడుకల్లోనూ ఆమె పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్‌ నేత పి.మోహన్‌యాదవ్‌ నిర్వహించిన ఈ వేడుకలకు స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అత్యంత వైభవంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి వేడుకలను అత్యంత ఆర్భాటంగా నిర్వహించారు.

కులగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి

లిబర్టీ: కులగణన చేయకుండా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తుందని బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి అన్నారు. పదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేసిన బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మోసపూరిత పరిపాలన చేస్తుందని ధ్వజమెత్తారు. సోమవారం దళ్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని నిర్ణయించిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పటికైనా బీసీల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడి కులగణన చేస్తామని అధికారికంగా ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలున్నారు.